సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
సోమవారం । 26 । ఫిబ్రవరి । 2024



రైల్వేస్టేషన్లకు మహర్దశ
బ్రిటీష్ కాలంలో నిర్మించిన జిల్లాలోని రైల్వేస్టేషన్ల రూపురేఖలు సమూలంగా మారిపోనున్నాయి.
8లో



టమాట కిలో రూ.13
కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.13 పలికింది. కనిష్టం రూ.5, సరాసరి రూ.8 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి



జిల్లా పరిధిలో ఆదివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. తూర్పు దిశగా గాలులు గంటకు 6 నుంచి 10 కిలో మీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

నేడు కలెక్టరేట్‌లో స్పందన



పుట్టపర్తి అర్బన్: కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా స్థాయి స్పందన కార్యక్రమం ఉంటుందని కలెక్టర్ అరుణ్‌బాబు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు తెలిపారు. జిల్లాతో పాటు పెనుకొండ సబ్‌కలెక్టర్ కార్యాలయం, ధర్మవరం, కదిరి ఆర్డీఓ కార్యాలయాలు , మండల స్థాయిలోనూ స్పందన కార్యక్రమం ఉంటుందన్నారు. ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. వినతి పత్రాలపై ఆధార్ నంబర్, ఫోన్ నెంబర్ తప్పనిసరిగా పొందుపరచాలన్నారు. అన్ని శాఖల అధికారులు తప్పక కార్యక్రమానికి హాజరుకావాలని ఆదేశించారు.

ఎస్పీ కార్యాలయంలోనూ...

పుట్టపర్తి టౌన్: జిల్లా పోలీస్ కార్యాలయంలో కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పోలీస్ కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. వివిధ సమస్యలపై ఎస్పీకి నేరుగా ఫిర్యాదు చేయవచ్చని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించింది.

పనితీరు మార్చుకోండి
- ఎస్పీ మాధవరెడ్డి

హిందూపురం అర్బన్: కొడికొండ చెక్‌పోస్టు సిబ్బంది పనితీరు తరచూ వివాదాస్పదంగా మారుతోందని, పనితీరు మార్చుకొని విధులు సక్రమంగా నిర్వర్తించాలని, లేకపోతే చర్యలు తప్పవని పోలీస్, సెబ్ సిబ్బందిని ఎస్పీ మాధవరెడ్డి హెచ్చరించారు. ఆదివారం మధ్యాహ్నం కొడికొండ చెక్‌పోస్టును ఆయన తనిఖీ చేశారు. 24 గంటలూ తనిఖీలు చేయాలని, ఒక్కోసారి తనిఖీలు ఆపేస్తున్నారని తన దృష్టికి వచ్చిందన్నారు. ఇది మంచి పద్ధతి కాదని స్పష్టం చేశారు. నిత్యం ఎంత మంది విధుల్లో ఉంటున్నారు? ఇప్పటి వరకు పట్టుకొన్న నగదు, మద్యం, చీరలు ఇతరత్రా వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎన్ని కేసులు నమోదు చేశారు? తీసుకొన్న చర్యలపై ఆరా తీశారు. ఎస్పీ వెంట ఎస్ఐ గంగాధర్, సెబ్ సీఐ శ్రీరాములు, సిబ్బంది ఉన్నారు.

14 కేంద్రాల్లో 'టెట్'
- ఉమ్మడి జిల్లాలో 10, బెంగళూరులో 4 కేంద్రాలు



అనంతపురం ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (ఏపీ టెట్) నిర్వహణకు 14 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 10 (అనంతపురంలో 6, తాడిపత్రిలో 2, గుత్తి, పుట్టపర్తిలో ఒక్కో కేంద్రం) బెంగళూరులో 4 కేంద్రాల్లో ఈనెల 27 నుంచి మార్చి 6 వరకూ పరీక్షలు జరగనున్నాయి. రోజూ రెండు విడతలుగా.. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ సాగుతాయి. అభ్యర్థులు హాల్‌టికెట్‌తో పాటు గుర్తింపు కార్డు వెంట తెచ్చుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి బి.వరలక్ష్మి తెలిపారు. గంట ముందే పరీక్ష కేంద్రం వద్దకు చేరుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రాల పూర్తి వివరాలను https:// deo ananthapuramu. blogpost.com వెబ్‌సైట్‌లో పొందుపరిచామని, అభ్యర్థులు పరిశీలించుకోవాలని కోరారు.

ఈ-కేవైసీకి మూడు రోజులే గడువు



హిందూపురం అర్బన్: టోల్ ప్లాజాల వద్ద ట్రాఫిక్ రద్దీ పెరగకుండా కేంద్ర ప్రభుత్వం ఫాస్టాగ్ ద్వారా టోల్ ట్యాక్స్ వసూలు చేస్తున్న విషయం తెలిసిందే. అయితే ఫాస్ట్‌ట్యాగ్‌కు కేవైసీ అప్‌డేట్ చేయడం చాలా ముఖ్యం. కేవైసీ పూర్తి చేయడాన్ని నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (NHAI) కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటి వరకు కేవైసీ పూర్తి చేసేందుకు గడువు జనవరి 31తో ముగిసింది. అయితే ఈ గడువును పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఈ గడువును ఫిబ్రవరి 29వ తేదీ వరకు పెంచుతూ నేషనల్ హైవే అథారిటీ నిర్ణయం తీసుకుంది. ఈ కేవైసీకి మరో మూడు రోజులు మాత్రమే గడువు ఉంది. ఈ కేవైసీ చేయించుకోకపోతే అకౌంట్ డీయాక్టివేట్ అవుతుందని బెంగళూరు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. దీనికి తోడు టోల్‌ప్లాజాల వద్ద రెట్టింపు టోల్ వసూలు చేస్తారన్నారు. టోల్‌గేట్ల వద్ద ఈ-కేవైసీ చేసేందుకు సహాయకులు ఉంటారని, లేకపోతే వెబ్‌సైట్ https:// fastag. ihmcl. com ద్వారా కూడా అప్‌డేట్ చేసుకోవచ్చని సూచించారు.



పెనుకొండ: సాయిబాబా కళాశాల పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి



హిందూపురంలోని ఎంజీఎం హైస్కూల్ వద్ద గ్రూప్-2 అభ్యర్థుల సందడి

ప్రశాంతంగా గ్రూప్-2 స్క్రీనింగ్

- పరీక్షకు 7,015 మంది హాజరు
- 1,224 మంది అభ్యర్థుల గైర్హాజరు

పుట్టపర్తి అర్బన్/హిందూపురం అర్బన్/పెనుకొండ: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) ఆధ్వర్యంలో ఆదివారం జిల్లాలో నిర్వహించిన గ్రూప్-2 స్క్రీనింగ్ పరీక్ష సజావుగా జరిగింది. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ పరీక్ష జరిగింది. జిల్లాలోని హిందూపురం, కదిరి, ధర్మవరం, మడకశిర పట్టణాల్లోని 28 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 8,239 మంది దరఖాస్తు చేసుకోగా పరీక్షకు 7,015 మంది హాజరయ్యారు. 85.14 శాతం మంది అభ్యర్థులు హాజరైనట్లు అధికారులు పేర్కొన్నారు. 1,224 మంది వివిధ కారణాలతో గైర్హాజరయ్యారు. పెనుకొండలో నిర్వహించిన పరీక్షను సబ్‌కలెక్టర్ అపూర్వభరత్ పరిశీలించారు. హిందూపురం పట్టణంలోని ఎంజీఎం హైస్కూల్, మహిళా డిగ్రీ కళాశాల, ఎల్ఆర్‌జీ నాయుడు కాలేజీల్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను ఎస్పీ మాధవరెడ్డి పరిశీలించారు. ఎస్పీ వెంట డీఎస్పీ కంజాక్షన్, పెనుకొండ సీఐ యుగంధర్, పోలీస్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

క్రిటికల్ కేర్ బ్లాక్ నిర్మాణానికి శంకుస్థాపన

- వర్చువల్‌గా కార్యక్రమంలో పాల్గొన్న ప్రధాన మంత్రి మోదీ
- అత్యవసర వైద్య సేవలు అందించవచ్చన్న కలెక్టర్ అరుణ్‌బాబు



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

హిందూపురం టౌన్: హిందూపురం జిల్లా ప్రభుత్వాస్పత్రిలో క్రిటికల్ కేర్ బ్లాక్ ద్వారా అత్యవసర పరిస్థితుల్లో రోగులకు వెంటిలేటర్‌పై వైద్యం అందించవచ్చని కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. ప్రధాన మంత్రి అయూష్మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్ ఆధ్వర్యంలో హిందూపురం ప్రభుత్వాస్పత్రిలో 50 పడకల సామర్థ్యంతో క్రిటికల్ కేర్ బ్లాక్‌ను నిర్మించనున్నారు. రూ.22.25 కోట్లతో ఏర్పాటు కానున్న క్రిటికల్ కేర్ బ్లాక్‌ను ప్రధాని నరేంద్ర మోదీ రాజ్‌కోట్ నుంచి వర్చువల్‌గా ఆదివారం సాయంత్రం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా స్థానిక ఆస్పత్రిలో ప్రధాని సందేశం ఏర్పాటు చేయగా, ముఖ్యఅతిథిగా కలెక్టర్ అరుణ్‌బాబు పాల్గొన్నారు. అనంతరం శంకుస్థాపన శిలాఫలకాన్ని కలెక్టర్ ఆవిష్కరించారు. కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ హిందూపురం ఆస్పత్రిలో పీఎం-ఏబీహెచ్ఐఎం ఆధ్వర్యంలో 50 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్ (సీసీబీ) నిర్మాణానికి రూ.22.25 కోట్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. నాణ్యంగా, త్వరితగతిన పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. క్రిటికల్ కేర్ అందుబాటులోకి వస్తే అత్యవసర సేవలు, వెంటిలేటర్‌పై వైద్యం, బ్రెయిన్ స్ట్రోక్‌కు గురైన వారు, రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించవచ్చన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, డీఎంఅండ్‌హెచ్ఓ కృష్ణారెడ్డి, డీసీహెచ్ఎస్ తిప్పేంద్ర నాయక్, ఆస్పత్రి సూపరింటెండెంట్ రోహిల్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి, ఆర్ఎంఓ రుక్మిణమ్మ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జోరుగా కృష్ణమ్మ గలగలలు

కృష్ణా జలాల వాటాలో జిల్లాకు సింహభాగం దక్కింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేక చొరవతోనే ఇదంతా సాధ్యమైంది. అయితే, ఎన్నికలు దగ్గర పడుతుండడంతో ప్రజలను ఏమార్చేందుకు ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా నీటి రాజకీయాలకు తెరతీశాయి. కృష్ణా జలాలు కుప్పంకు తరలిపోతున్నాయంటూ రాద్ధాంతం చేస్తున్నాయి.

- నేటికీ జిల్లాలో కృష్ణా జలాల ప్రవాహం
- తాగునీటి ఇబ్బందులు దూరం
- భూగర్భ జలాల వృద్ధికి దోహదం
- పంటల సాగుకు భరోసా కల్పించిన వైనం
- ఓర్వలేక ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా దుష్ప్రచారం
- ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రజల దృష్టి మరల్చేందుకు రాద్ధాంతం



కృష్ణాజలాలతో కళకళలాడుతున్న కూడేరు మండలం ముద్దలాపురం చెరువు

అనంతపురం సెంట్రల్: శ్రీశైలం జలాశయం నుంచి హంద్రీనీవా ప్రాజెక్టుకు ఇప్పటి వరకూ 28.304 టీఎంసీలు ఎత్తిపోశారు. ఇందులో ప్రవాహ నష్టాలు పోనూ ఉమ్మడి అనంతపురం జిల్లాలో 15.637 టీఎంసీలు అందాయి. ముందు ఉన్న కర్నూలు జిల్లాకు 4.023 టీఎంసీలు, అనంతపురం జిల్లా తర్వాత వచ్చే అన్నమయ్య జిల్లాకు 1.589 టీఎంసీలు వెళ్లాయి. జిల్లాకు అందిన కృష్ణా జలాల్లో గుంతకల్లు డివిజన్ పరిధిలో చెరువులకు 0.352 టీఎంసీలు వినియోగించారు. దాదాపు 45 చెరువులకు పైగా నింపారు. జీడిపల్లి రిజర్వాయర్‌కు 9.033 టీఎంసీలు, గొల్లపల్లి- 0.204 టీఎంసీలు, చెర్లోపల్లి రిజర్వాయర్‌కు 1.938 టీఎంసీలు అందించారు. పీఏబీఆర్‌కు నీటిని వదిలారు. 4.735 టీఎంసీలు సాగునీటికి విడుదల చేశారు.

సీఎం చొరవతో..

వరుణుడు ముఖం చాటేయడంతో గత ఏడాది వర్షాభావ పరిస్థితులను చవిచూడాల్సి వచ్చింది. ప్రాజెక్టులకు ఆశించిన మేర వరద నీరు రాలేదు. శ్రీశైలం రిజర్వాయర్‌కు గతంలో కంటే అతి తక్కువ వరద నీరు చేరింది. అయినప్పటికీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని రాయలసీమ జిల్లాలకు కృష్ణా జలాలు అందేలా చర్యలు తీసుకున్నారు. సీఎం సంకల్పానికి అనుగుణంగా అధికారులు నీటి పంపిణీ పకడ్బందీగా చేపట్టారు. దీంతో నేటికీ జిల్లాలో కృష్ణా జలాలు ప్రవహిస్తున్నాయి. హంద్రీనీవా కాలువ పరివాహక ప్రాంతాల్లో భూగర్భ జలాల పెరుగుదలకు దోహదం చేస్తున్నాయి. పశుపక్ష్యాదులకు తాగునీటి కొరత తీర్చాయి.

ఎల్లో మీడియా గగ్గోలు..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలతో కరువు జిల్లా చల్లగా ఉంటే ఎల్లో మీడియా ఓర్వలేక పోతోంది. కుప్పంకు నీటిని తరలిస్తున్నారంటూ గగ్గోలు పెడుతోంది. రాయలసీమ జిల్లాలను సస్యశ్యామలం చేయాలన్న లక్ష్యంతో మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి హంద్రీనీవా ఎత్తిపోతల పథకం చేపట్టారు. అందులో భాగంగానే నేడు అన్ని ప్రాంతాలకు సమంగా నీటిని పంపిణీ చేస్తుంటే ప్రతిపక్షాలు మాత్రం నీచ రాజకీయాలకు తెరతీస్తున్నాయి. ప్రజల దృష్టి మరల్చేందుకు ఎల్లో మీడియా అసత్య కథనాలు వండుతూ నానా యాగీ చేస్తోంది. దీనిపై అన్ని వర్గాల నుంచి విస్మయం వ్యక్తమవుతోంది.

కృష్ణా జలాల వినియోగం ఇలా..	
శ్రీశైలం నుంచి హంద్రీనీవాకు వచ్చిన నీరు	28.304 టీఎంసీలు
జిల్లాకు విడుదలైన నీరు	15.637 టీఎంసీలు
కర్నూలు	4.023 టీఎంసీలు
అన్నమయ్య	1.589 టీఎంసీలు

పుష్కలంగా నీరు



గత ఏడాది వర్షాలు సరిగా కురవకపోవడంతో పంటలు పండలేదు. వేసవిలో తాగునీటి ఇబ్బందులు వస్తాయని ఆందోళన చెందాం. అయితే హంద్రీనీవా ద్వారా మా ఊరి చెరువుకు నీటిని విడుదల చేశారు. దీంతో ముప్పు తప్పింది. చెరువుకు సమీపంలో వందలాది ఎకరాల్లోని బోరుబావుల్లో పుష్కలంగా నీరు వస్తోంది. – సూర్యనారాయణ, రైతు, ముద్దలాపురం, కూడేరు మండలం

ఉమ్మడి జిల్లాకే 80 శాతం నీరు



గత ఏడాది లోటు వర్షపాతంతో శ్రీశైలం జలాశయానికి అనుకున్న స్థాయిలో వరద రాలేదు. అయినా సీఎం వైఎస్ జగన్ ముందుచూపుతో వ్యవహరించి నీటిని రాబట్టారు. రాయలసీమ జిల్లాలకు కృష్ణా జలాలను తరలించేలా చర్యలు తీసుకున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాకే 80 శాతం నీటిని వాడుకున్నాం. ఆయకట్టును కాపాడడంతో పాటు తాగునీటి కోసం చెరువులకు విడుదల చేశాం. జిల్లాతో పాటు అన్ని ప్రాంతాలకు సమంగా నీటిని పంపిణీ చేసేందుకు సిబ్బందితో కలిసి రేయింబవళ్లు కష్టపడుతున్నాం.
– దేశానాయక్, ఎస్ఈ, హంద్రీనీవా సుజల స్రవంతి ప్రాజెక్టు

సుర్రుమంటున్న సూరీడు



అనంతపురం అగ్రికల్చర్: జిల్లా వ్యాప్తంగా వేసవి తాపం ప్రారంభమైంది. రాత్రి, పగలు ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. మార్చి నుంచి సూరీడు మరింత చెలరేగే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఏప్రిల్‌తో పాటు మే నెలలో గ్రీష్మ తాపం పతాక స్థాయికి చేరుకునే అవకాశం ఉన్నట్లు శాస్త్రవేత్తలు చెబుతున్నారు. కొన్నాళ్లుగా మధ్యాహ్న సమయంలో ఎండలు సుర్రుమనిపిస్తున్నా.. ఉదయం చాలా మండలాల్లో చలి వాతావరణం నెలకొంది. అయితే 2 రోజులుగా ఉదయం పూట కూడా కనిష్ట ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. శనివారం శింగనమలలో 39.3 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. విడపనకల్లు, గుంతకల్లు, నార్పల, బుక్కరాయసముద్రం, అనంతపురం, రాప్తాడు, ఆత్మకూరు తదితర మండలాల్లో 38 నుంచి 39 డిగ్రీల వరకూ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. శ్రీ సత్యసాయి జిల్లాలో కూడా శనివారం చెన్నేకొత్తపల్లిలో 39.1 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదు కాగా, ధర్మవరం, పరిగి, ముదిగుబ్బ,కనగానపల్లి, బత్తలపల్లి, కొత్తచెరువు తదితర మండలాల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వేసవి ప్రారంభంలోనే పగటి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు చేరువ అవుతుండటం గమనార్హం. రాత్రి ఉష్ణోగ్రతలు కూడా మొదట్లోనే 20 నుంచి 25 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి. మార్చి, ఏప్రిల్, మే నెలల్లో భానుడి భగభగలు అధికంగా కొనసాగే పరిస్థితులు కనిపిస్తున్నాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఏప్రిల్, మే నెలలో పగటి ఉష్ణోగ్రత 45 డిగ్రీల మార్క్ చేరుకోవచ్చని అంచనా వేస్తున్నారు.

అభివృద్ధి 'బాట'

- నూతన శోభను సంతరించుకున్న గ్రామీణ రహదారులు
- లింకు రోడ్లను పూర్తిచేయడంతో సర్వత్రా హర్షం
- నాలుగేళ్లలో 804 కి.మీ రోడ్లు
- రూ.366 కోట్లను ఖర్చు చేసిన ప్రభుత్వం



రూ.2.5 కోట్లతో పూర్తయిన గోరంట్ల - కొండకమర్ల రహదారి

పుట్టపర్తి అర్బన్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి గ్రామీణ రహదారులకు మహర్దశ పట్టింది. పట్టణాలు మొదలు మారుమూల పల్లెలకు సైతం రోడ్లు వేయడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అన్ని శాఖలు సమష్టిగా కృషి చేయడంతో రోడ్లు నూతన శోభను సంతరించుకున్నాయి.

646.38 కి.మీ పూర్తి

నూతనంగా ఏర్పాటైన శ్రీసత్యసాయి జిల్లాలో ఆర్అండ్‌బీ ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల్లో 804 కిలో మీటర్ల మేర రోడ్ల అభివృద్ధికి రూ.366.07 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. ప్రధాన రోడ్లతో పాటు గ్రామీణ లింకు రోడ్లు, వర్షాలకు, వరదలకు దెబ్బతిన్న రోడ్లు, బ్రిడ్జీల ఏర్పాటుకు, కొన్ని ప్రత్యేక సందర్భాల్లో రోడ్ల ఏర్పాటుకు ఈ నిధులు మంజూరు చేశారు. రాష్ట్ర , కేంద్ర ప్రభుత్వం సమన్వయంతో కొన్ని రోడ్లు ఏర్పాటు చేశారు. 804 కిలో మీటర్లలో ఇప్పటికే 646.38 కిలోమీటర్ల రోడ్లు పూర్తి చేశారు. 2023-24 ఏడాదిలో మంజూరైన పనులు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయి. త్వరలోనే వాటిని కూడా పూర్తి చేస్తామని ఆర్అండ్‌బీ అధికారులు చెబుతున్నారు.

కళకళలాడుతున్న గ్రామాలు

రోడ్లు పనులు పూర్తి కావడంతో జిల్లాలోని వివిధ గ్రామాలు కళకల లాడుతున్నాయి. ఎంతో కాలంగా రోడ్డు మార్గం సరిగా లేక ఇబ్బంది పడిన ప్రజలు రోడ్లు నూతన శోభను సంతరించుకోవడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. మారుమూల గ్రామాలకు సైతం రోడ్లు వేయడంతో పట్టణాలకు త్వరగా చేరుకునేందుకు , రాత్రిళ్లు ఎంత ఆలస్యమైనా ఇంటికి చేరుకోవడానికి సులభంగా ఉందని చెబుతున్నారు. జిల్లాలో ఈ నాలుగేళ్లలో సుమారు 104 రోడ్లు పనులు చేపట్టారు.

జిల్లాలో రోడ్డు నిర్మాణాలు ఇలా...		
సంవత్సరం	రోడ్డు (కిలో మీటర్లలో)	ఖర్చు చేసిన మొత్తం (రూ.కోట్లలో)
2019-20	62.95	20.30
2020-21	562.85	230.77
2022-23	63.30	80.10
2023-24	115.50	34.90

అభివృద్ధిలో రహదారులే కీలకం



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి నిర్విరామంగా అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలు అమలు చేస్తుండటంతో ప్రజలు సంతోషంగా ఉన్నారు. ముఖ్యంగా అభివృద్ధిలో కీలకమైన రహదారులు ఏర్పాటు చేయడంతో ప్రజలకు కష్టాలు తప్పాయి. ప్రధాన రహదారులకు గ్రామీణ లింకు రోడ్లు పూర్తి చేయడంతో గొప్ప విషయం.
– నరసింహులు, కోటకమ్మొరుపల్లి, గోరంట్ల మండలం

ఇప్పుడు ఏ ఇబ్బందీ లేదు



గోరంట్ల నుంచి ఓడీసీ మండలం కొండకమర్ల దాకా తారు రోడ్డు వేశారు. సుమారు 10.5 కిలో మీటర్ల రోడ్డును రూ.2.5 కోట్లతో పూర్తి చేశారు. దీంతో అటు కదిరి, ఇటు గోరంట్లకు వెళ్లడానికి సులభంగా ఉంది. ముఖ్యంగా అటవీ ప్రాంతంలోని గంగిరెడ్డిపల్లి ఆంజనేయస్వామి ఆలయాన్ని చేరుకునేందుకు సులువుగా ఉంది. ఇప్పుడు ఏ ఇబ్బంది లేకుండా ప్రయాణం సాఫీగా సాగుతోంది.
– ఆదెప్ప, గంగిరెడ్డిపల్లి, పుట్టపర్తి మండలం

అన్ని రోడ్లు పూర్తి చేస్తాము



జిల్లాలో ఆర్అండ్‌బీ ఆధ్వర్యంలో చేపట్టిన రోడ్లన్నీ త్వరలోనే పూర్తి చేస్తాము. గత నాలుగేళ్లలో ఆర్అండ్‌బీ ఆధ్వర్యంలో 646 కిలో మీటర్ల రోడ్లను పూర్తి చేశాము. ప్రభుత్వం సుమారు రూ.366 కోట్లు మంజూరు చేసింది. ఈ పనులన్నీ ఆర్ఓఆర్, నాడు-నేడు, సీఆర్ఎఫ్ తదితర నిధులతో చేపట్టాము.
– సంజీవయ్య, ఈఈ, ఆర్అండ్‌బీ

టీడీపీలో సీటు చిచ్చు



పెనుకొండలో పార్టీ పదవులకు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటిస్తున్న బీకే వర్గీయులు

- పెనుకొండలో బీకే అనుచరుల రాజీనామా
- నిర్ణయం మార్చుకోకపోతే టీడీపీ పతనం తప్పదని హెచ్చరిక

పెనుకొండ: టీడీపీలో టిక్కెటు చిచ్చు రాజుకుంది. జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బీకే పార్థసారథికి కాకుండా టీడీపీ నాయకురాలు సవితమ్మకు పెనుకొండ అసెంబ్లీ టికెట్ కేటాయించడంతో బీకే అనుచరులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇందులో భాగంగానే తమ నిరసనలను కొనసాగిస్తున్నారు. ఆదివారం పలువురు టీడీపీ నాయకులు తమ పార్టీ పదవులకు రాజీనామా చేశారు. బీకే పార్థసారథికి న్యాయం జరిగితేనే టీడీపీలో ఉంటామని, లేకపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటామని తేల్చి చెబుతున్నారు. పెనుకొండ మాజీ ఎంపీపీ యశోదమ్మ భర్త కేశవయ్య, సుబ్బమ్మ, నరహరి, బీవీపీ నాయుడు, రవి, సిద్ధయ్య తదితరులు మాజీ ఎమ్మెల్యే బీకే ఇంటి వద్దకు తమ పదవులకు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.

చంద్రబాబువి మూర్ఖపు ఆలోచనలు

చంద్రబాబు, లోకేష్‌వి మూర్ఖపు ఆలోచనలని బీకే అనుచరులు మండిపడ్డారు. 35 ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో ఎక్కడా మచ్చలేని నాయకుడిగా ఉన్న పార్థసారథిని పక్కన పెట్టి సవితమ్మకు టికెట్ ఇవ్వడం సరికాదన్నారు. కురుబల్లో ఎంతో పేరున్న బీకేకు అన్యాయం చేస్తే టీడీపీ పతనం తప్పదన్నారు. ప్రతి నియోజకవర్గంలో పర్యటించి టీడీపీకి తగిన గుణపాఠం నేర్పుతామని హెచ్చరించారు. అనంతరం పట్టణంలో బీకే పార్థసారథికి మద్దతుగా ర్యాలీ నిర్వహించారు. పార్థసారథికి అన్యాయం జరిగితే నాలుగు జిల్లాల్లో ఆ ప్రభావం పడి టీడీపీ మట్టి కొట్టుకుపోవడం ఖాయమన్నారు. వెంటనే చంద్రబాబు తన నిర్ణయాన్ని ఉపసంహరించుకుని బీకేకి టికెట్ ఇవ్వాలన్నారు. సీబీఐ కేసులో కూరుకుపోయిన సవితమ్మ భర్త వెంకటేశ్వరరావు అవినీతి నేపథ్యంలో ఆమెపై ప్రజల్లో నమ్మకం లేదని, చంద్రబాబు ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలన్నారు.

రైల్వే స్టేషన్లకు మహర్దశ

- 'అమృత్ భారత్' అమలుతో మారనున్న రైల్వేస్టేషన్ రూపురేఖలు
- ఉమ్మడి జిల్లాలోని అనంతపురం, గుత్తి, తాడిపత్రి, ధర్మవరం రైల్వేస్టేషన్లలో ఆధునికీకరణ పనులు

అనంత కీర్తి కిరీటంలో మరో కలికితురాయి చేరనుంది. బ్రిటీష్ కాలంలో నిర్మించిన అనంతపురం రైల్వేస్టేషన్ రూపురేఖలు సమూలంగా మారిపోనున్నాయి. ప్రయాణికుల రద్దీ, పెరిగిన రైళ్ల సంఖ్యకు అనుగుణంగా అంతర్జాతీయ ప్రమాణాలతో ఉమ్మడి జిల్లాలోని పలు రైల్వేస్టేషన్ల ఆధునికీకరణ పనులకు దక్షిణ మధ్య రైల్వే శాఖ శ్రీకారం చుట్టింది. అమృత్ భారత్ పథకంలో భాగంగా అనంతపురం, గుత్తి, తాడిపత్రి, ధర్మవరం, హిందూపురం రైల్వేస్టేషన్లకు మహర్దశ చేకూరనుంది. నేడు న్యూఢిల్లీ నుంచి వర్చువల్ విధానంలో పనులను ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించనున్నారు.

అనంతపురం సిటీ: జిల్లాలోని రైల్వే స్టేషన్లను అన్ని హంగులతో ఆధునీకరించేందుకు దక్షిణ మధ్య రైల్వే శాఖ ముందుకొచ్చింది. ఇందులో భాగంగా గుంతకల్లు రైల్వే డివిజన్ వ్యాప్తంగా 15 రైల్వే స్టేషన్లను ఆధునీకరించనున్నారు. ఇందులో అనంతపురం, ధర్మవరం, గుత్తి, తాడిపత్రి, కడప, రాజంపేట, ఆదోని, డోన్, చిత్తూరు, మదనపల్లి, శ్రీకాళహస్తి, మంత్రాలయం, కర్ణాటకలోని రాయచూరు, యాదగిరి రైల్వే స్టేషన్లు ఉన్నాయి.

'అనంత' అందాలకు రూ.9.29 కోట్లు..

అమృత్ భారత్ పథకం అమలులో భాగంగా అనంతపురం రైల్వేస్టేషన్‌ను అత్యంత ఆధునిక హంగులతో పునర్నిర్మించేందుకు రూ.9.29 కోట్లను వెచ్చించనున్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దనున్నారు. ఇప్పటికే అనంతపురం రైల్వేస్టేషన్‌లో


అనంతపురం రైల్వే స్టేషన్ నమూనా

మొదటి రోడ్డు వైపున పనులు పూర్తి కావొచ్చాయి. ఇటువైపు ఉన్న పాత బిల్డింగులను నేలమట్టం చేశారు. అమృత్ భారత్ పథకం కింద ఎంపికైన మిగిలిన 14 రైల్వే స్టేషన్లను కూడా ఇదే తరహాలో ఆధునికీకరించనున్నారు. గుత్తి స్టేషన్‌కు రూ.17.13 కోట్లు, తాడిపత్రి స్టేషన్‌కు రూ.7.68 కోట్లు, ధర్మవరం స్టేషన్‌కు రూ.8.64 కోట్లు, హిందూపురం స్టేషన్‌కు రూ.15 కోట్లు కేటాయించారు.

చేపట్టనున్న పనులు..

ఆధునికీకరణ పనుల్లో భాగంగా ఆకర్షణీయమైన ముఖ ద్వారాలు, ఉద్యానీకరణ పనులతో పాటు రోడ్ల విస్తరణ, సౌకర్యవంతమైన అంతర్గత రహదారుల నిర్మాణం, పార్కింగ్, మెరుగైన విద్యుద్దీకరణ పనులు చేయనున్నారు. అలాగే ల్యాండ్‌స్కేపింగ్, గ్రీన్ ప్యాచ్‌లతో రైల్వే ప్రయాణికులకు ఆహ్లాదాన్ని పంచేలా చేయనున్నారు. స్టేషన్ బిల్డింగ్, సర్క్యులేటింగ్ ఏరియా కోసం రెండో ప్రవేశ ద్వారం ఏర్పాటు, ఉన్నత స్థాయి ప్లాట్‌ఫారమ్‌లు, లిఫ్టులు, తగినన్ని షెల్టర్ల నిర్మాణం, అధిక నాణ్యత గల పబ్లిక్ అనౌన్స్‌మెంట్ సిస్టం, ఎల్‌ఈడీ ఆధారిత స్టేషన్ నేమ్ బోర్డులు, అత్యాధునిక వెయిటింగ్ హాళ్లు, యూజర్ ఫ్రెండ్లీ సంకేతాలు ఏర్పాటు చేయనున్నారు.

గర్వంగా ఉంది



అంతర్జాతీయ ప్రమాణాలతో రైల్వే స్టేషన్లను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతుండడం చాలా గర్వంగా ఉంది. ఈ పనులు పూర్తయితే రైల్వే స్టేషన్లు అంతర్జాతీయ విమానాశ్రయాలను తలపిస్తాయనడంలో సందేహం లేదు.
– సుమతి సురతాని, పారిశ్రామిక వేత్త, అనంతపురం

ప్యాసింజర్ రైళ్లను పునరుద్ధరించాలి



అనంతపురం రైల్వేస్టేషన్ ఒక వైపు పూర్తిగా అభివృద్ధి చేశారు. చూస్తుంటే ఎంతో సంతోషమేస్తోంది. వృద్ధులు, వికలాంగులకు సౌకర్యవంతంగా ఉండేలా లిఫ్టులు ఏర్పాటు చేయడం ఆనందంగా ఉంది. కరోనా లాక్‌డౌన్ సమయంలో రద్దు చేసిన ప్యాసింజర్ రైళ్లను పూర్తి స్థాయిలో పునరుద్ధరిస్తే సామాన్య, మధ్య తరగతి వర్గాల వారికి ఎంతో మేలు చేసిన వారవుతారు.
– రజిత, చిరుద్యోగి, అనంతపురం

యుద్ధ ప్రాతిపదికన పనులు



అనంతపురం రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులు యుద్ధ ప్రాతిపదికన సాగుతున్నాయి. రూ.9.29 కోట్లతో అన్ని హంగులతో స్టేషన్‌ను ఆధునీకరించనున్నారు. ఇప్పటికే ఒక వైపు పనులు పూర్తి కాగా, మరో వైపు పనులు ఊపందుకున్నాయి.
– మాసినేని అశోక్‌కుమార్, రైల్వే స్టేషన్ మేనేజర్, అనంతపురం

క్లుప్తంగా

ఉత్సాహంగా తైక్వాండో పోటీలు


పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

అనంతపురం: జిల్లా కేంద్రంలోని క్రీడా ప్రాధికార సంస్థ ఇండోర్ స్టేడియంలో జిల్లా స్థాయి జూనియర్ తైక్వాండో పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా స్పోర్ట్స్ అథారిటీ అధికారి నరసింహారెడ్డి, మచ్చా రామలింగారెడ్డి, రంగంపేట గోపాలరెడ్డి, జిల్లా తైక్వాండో సంఘం ప్రధాన కార్యదర్శి గురుస్వామి, ఆర్గనైజర్ సెక్రెటరీ శాంతరాజ్ హాజరయ్యారు. పోటీల్లో ఉమ్మడి జిల్లా నుంచి 150 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడిన యువకుడు


గాయపడిన రాజు

అనంతపురం సిటీ: రైలు నుంచి జారిపడి ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు... బెంగళూరు నుంచి రాయచూరుకు బయలుదేరిన రైలు ఆదివారం ఉదయం అనంతపురం రైల్వే స్టేషన్‌కు చేరుకుంది. ఆ సమయంలో డోరు వద్ద నిలబడి ప్రయాణిస్తున్న ఓ యువకుడు అదుపు తప్పి ప్లాట్‌ఫారంపై పడ్డాడు. ఘటనలో ఎడమ కాలికి తీవ్ర గాయమైంది. క్షతగాత్రుడిని కర్ణాటకలోని మద్వార్‌కు చెందిన సన్న తమ్మన్న కుమారుడు రాజుగా గుర్తించారు. వెంటనే క్షతగాత్రుడిని 108 అంబులెన్స్ ద్వారా జీజీహెచ్‌కు జీఆర్పీ ఎస్‌ఐ విజయ్‌కుమార్, సిబ్బంది తరలించారు.

యువకుడి దుర్మరణం


మృతుడు ప్రవీణ్

పెనుకొండ రూరల్: ద్విచక్ర వాహనం అదుపు తప్పి లారీని ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... కర్ణాటక రాజధాని బెంగళూరులోని నగరబావికి చెందిన ప్రవీణ్ (31) వెల్డర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో అనంతపురం జిల్లా పంపనూరులో కొన్ని రోజులుగా వెల్డింగ్ పనుల్లో పాలు పంచుకుంటున్నాడు. ఆదివారం సెలవు కావడంతో శనివారం రాత్రి ద్విచక్ర వాహనంపై బెంగళూరుకు బయలుదేరాడు. పెనుకొండ సమీపంలోని 44వ జాతీయ రహదారిపై కియా పోలీస్ స్టేషన్ ఎదురుగా స్పీడ్ బ్రేకర్లను దాటుకునే క్రమంలో వాహనం అదుపు తప్పి ఎదురుగా ఉన్న లారీని ఢీకొంది. ఘటనలో తలకు తీవ్ర గాయమై ప్రవీణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై కియా ఎస్‌ఐ రంగడు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

యువకుడి ఆత్మహత్య

కుందుర్పి: క్షయ వ్యాధితో బాధపడుతున్న ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... కుందుర్పి గ్రామానికి చెందిన బోయ నారాయణప్ప కుమారుడు మంజునాథ్ (21) కొంత కాలంగా క్షయ వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో ఊపిరి తీసుకునేందుకు తీవ్ర ఇబ్బంది పడుతున్న మంజునాథ్ శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ వెంకటస్వామి, అక్కడకు చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేశారు.

లారీ కింద పడి చిన్నారి మృతి



లేపాక్షి: మండలంలోని కంచిసముద్రం గ్రామానికి చెందిన నందిని, నరసింహమూర్తి దంపతుల కుమారుడు రోహిత్ (2) ప్రమాదవశాత్తు లారీ కిందపడి మృతి చెందాడు. శిరివరం నుంచి లేపాక్షికి ఖాళీగా బయలుదేరిన లారీ ఆదివారం రాత్రి 8 గంటలకు కంచిసముద్రంలోకి ప్రవేశించగానే రోడ్డు పక్కన ఆడుకుంటున్న రోహిత్‌ను ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన బాలుడిని వెంటనే లేపాక్షిలోని పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే బాలుడు మృతి చెందినట్లు నిర్ధారించారు.

సహకార యూనియన్ జాతీయ కార్యవర్గంలో పలువురికి చోటు

అనంతపురం అగ్రికల్చర్: ఆల్ ఇండియా కో ఆపరేటీవ్ బ్యాంక్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శిగా జిల్లాకు చెందిన కేవీఎస్ రవికుమార్ ఎంపికయ్యారు. ఈ మేరకు యూనియన్ జిల్లా కమిటీ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొంది. దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల కో ఆపరేటీవ్ ఫెడరేషన్ ప్రతినిధులతో ఆదివారం హైదరాబాద్‌లో 8వ జాతీయ మహాసభలు జరిగాయి. ఇందులో నూతన జాతీయ కార్యవర్గం ఎంపిక చేశారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉన్న రవికుమార్‌ను జాతీయ ప్రధాన కార్యదర్శిగా, సి.సునీతను జాతీయ కార్యదర్శిగా ఎన్నుకున్నారు.

యువకుడి బలవన్మరణం


శివానాయక్ (ఫైల్)

ముదిగుబ్బ: మండలంలోని అడవిబ్రాహ్మణపల్లి తండాకు చెందిన శివానాయక్ (20) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు బతుకు తెరువు కోసం శివానాయక్ తల్లిదండ్రులు కేరళకు వలస వెళ్లారు. దీంతో ఇంటి వద్ద ఒక్కడే ఉంటున్న శివానాయక్ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేశారు. కాగా, శివానాయక్ మృతికి కారణాలు తెలియాల్సి ఉంది.

వ్యక్తి అనుమానాస్పద మృతి


మృతుడు నరసింహమూర్తి

పరిగి: మండలంలోని కాలువపల్లి సమీపంలో ఉన్న గార్మెంట్స్ పరిశ్రమ వద్ద ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపిన మేరకు... రొద్దం మండలం నల్లూరు గ్రామానికి చెందిన డ్రైవర్ నరసింహమూర్తి (48) పరిగి మండలం కాలువపల్లి వద్ద ఉన్న గార్మెంట్స్ పరిశ్రమలకు ఆటోలో మహిళా కార్మికులను తరలించేవాడు. ఆదివారం ఉదయం కుటుంబసభ్యులకు తెలిపి ఆటోలో కార్మికులను తీసుకుని పరిశ్రమకు బయలుదేరాడు. ఉదయం 10 గంటలకు కాలువపల్లి గేట్ సమీపంలోని ఓ గోదాం వద్ద మృతదేహమై కనిపించాడు. అటుగా వెళుతున్న వారు గుర్తించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఆటో నంబర్ ప్లేట్ ఆధారంగా మృతుడిని నరసింహమూర్తిగా నిర్ధారించుకుని సమాచారం అందివ్వడంతో కుటుంబసభ్యులు అక్కడకు చేరుకున్నారు. మృతదేహాన్ని గుర్తించి భార్య సిద్దగంగమ్మ కన్నీరు మున్నీరుగా విలపించారు. అయితే తన భర్త మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ ఆమె ఫిర్యాదు చేయడంతో ఆ దిశగా పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, మృతుడికి కుమారుడితో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

భర్త చేతిలో భార్య హతం


హతురాలు అరుణ

తాడిపత్రి అర్బన్: మద్యం మత్తులో భార్యను హతమార్చిన ఘటన తాడిపత్రిలో సంచలనం రేకెత్తించింది. పోలీసులు తెలిపిన మేరకు... తాడిపత్రిలోని విజయలక్ష్మి థియేటర్ సమీపంలో నివాసముంటున్న అరుణ(38), రామాంజినేయులుకు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. వ్యవసాయ కూలి పనులతో జీవనం సాగిస్తున్న రామాంజినేయులు మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో రోజూ సంపాదన మొత్తం తాగుడుకే ఖర్చు చేసి మత్తులో ఇంటికి చేరుకోవడం మొదలు పెట్టాడు. తాగుడు మానేసి పిల్లల భవిష్యత్తు గురించి ఆలోచించాలని భార్య పలుమార్లు చెప్పినా పెడచెవిన పెట్టేవాడు. శనివారం రాత్రి మద్యం మత్తులో ఇంటికి చేరుకున్న రామాంజినేయులును అరుణ గట్టిగా నిలదీసింది. యుక్తవయసుకొచ్చిన కుమార్తెకు పెళ్లి చేయాలనే ఆలోచన లేకపోతే ఎలా అంటూ ప్రశ్నించింది. ఆ సమయంలో రామాంజినేయులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ రోకలి బండ తీసుకుని అరుణ తలపై గట్టిగా బాదాడు. ఘటనతో కుప్పకూలిన అరుణను స్థానికులు వెంటనే ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. హతురాలి సోదరుడు గొందిపల్లి రామాంజినేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు.

27న మహిళా ఉద్యోగ మేళా

అనంతపురం: ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ ఆధ్వర్యంలో ఈ నెల 27న మహిళా ఉద్యోగ మేళా నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆ సెంటర్ డైరెక్టర్ వైవీ మల్లారెడ్డి ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. పదో తరగతి పాస్, డిగ్రీ పాస్/ ఫెయిల్ అయి 18 నుంచి 26 సంవత్సరాల్లోపు వయసున్న నిరుద్యోగ మహిళలు అర్హులు. ఉద్యోగానికి ఎంపికైన వారు కర్ణాటకలోని కోలారు జిల్లా నర్సాపుర పారిశ్రామిక వాడలోని ప్రముఖ మొబైల్, ఎలక్ట్రానిక్ తయారీ సంస్థలో ప్రొడక్షన్ ఆపరేటర్లు, టెక్నికల్ ఆపరేటర్లుగా పనిచేయాల్సి ఉంటుంది. పూర్తి వివరాలకు 95138 22234లో సంప్రదించవచ్చు.

● అశ్వత్థానికి పోటెత్తిన భక్తులు


తిరునాలలో భక్తుల రద్దీ

పెద్దపప్పూరు: మాఘమాసం మూడో ఆదివారాన్ని పురస్కరించుకుని పెద్దపప్పూరు మండలం అశ్వత్థ నారాయణస్వామి క్షేత్రానికి భక్తులు పోటెత్తారు. పెన్నానదిలో పుణ్య స్నానాలు ఆచరించి నారాయణస్వామి, చక్రభీమలింగేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజల్లో శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పాల్గొన్నారు. నది లోతట్టు ప్రాంతానికి వృద్ధులు, చిన్నారులు వెళ్లకుండా పెద్దవడుగూరు సీఐ రోషన్, ఎస్‌ఐ శరత్ చంద్ర ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. వసతి, సౌకర్యాలను ఆలయ చైర్మన్ చిక్కేపల్లి శ్రీనివాసరెడ్డి, ఈఓ సుబ్రహ్మణ్యం పర్యవేక్షించారు. మొక్కుబడిలో భాగంగా పలువురు భక్తులు అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. శనివారం రాత్రి ఏర్పాటు చేసిన రంగస్థల నాటకం ఆకట్టుకుంది.

రెచ్చిపోయిన మద్యం మాఫియా

● సెబ్ సిబ్బందిపై దాడి


చికిత్స పొందుతున్న సెబ్ హెడ్ కానిస్టేబుల్ వెంకటేష్

పరిగి: మద్యం మాఫియా చెలరేగిపోయింది. ఏకంగా సెబ్ సిబ్బందిపై దాడికి దిగడంతో వారు గాయాలపాలయ్యారు. పరిగి ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపిన వివరాల మేరకు... శనివారం రాత్రి కర్ణాటక సరిహద్దు ప్రాంతమైన విశలాపురం మద్యం షాపు నుంచి ఇద్దరు వ్యక్తులు ఆంధ్రా సరిహద్దు ప్రాంతం పరిగి మండలంలోని శ్రీరంగరాజుపల్లి పరిసరాలకు అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తున్నారు. సమాచారం తెలిసిన హిందూపురం సెబ్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సెబ్ హెడ్ కానిస్టేబుల్ వెంకటేష్, డ్రైవర్ పురుషోత్తం సరిహద్దు ప్రాంతంలో తనిఖీలు నిర్వహించారు. ఈక్రమంలో ఓ ద్విచక్ర వాహనంపై ఇద్దరు వ్యక్తులు వస్తుండగా వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. అక్కడిక్కడే రెండు కేసుల కర్ణాటక మద్యం బాక్సులు పట్టుబడ్డాయి. వెంటనే ఇద్దరినీ అదుపులోకి తీసుకుంటుండగా ఓ వ్యక్తి అక్కడి నుంచి సెబ్ సిబ్బంది కళ్లుగప్పి తప్పించుకున్నాడు. మరో వ్యక్తితో పాటూ పట్టుబడిన కర్ణాటక మద్యం, ద్విచక్ర వాహనాన్ని పరిగి పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తున్నారు. ఈక్రమంలో పరారైన వ్యక్తి తనకు పరిచయాలు, సన్నిహితులకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చాడు. దీంతో కొంత మంది దుండగులు అక్కడికి చేరుకున్నారు. అంతటితో ఆగకుండా సెబ్ కానిస్టేబుల్ వెంకటేష్, డ్రైవర్ పురుషోత్తంను చితకబాదారు. పట్టుబడిన ద్విచక్ర వాహనంతో అక్కడి నుంచి ఉడాయించారు. గాయపడిన సెబ్ సిబ్బంది కర్ణాటక మద్యం ప్యాకెట్లతో పరిగి పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని, ఆపై వైద్య చికిత్సల కోసం హిందూపురం ప్రభుత్వాస్పత్రికి వెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ పోలీసులకు దాడి ఘటనకు సంబంధించిన వివరాలు తెలిపారు. పరిగి పోలీస్‌స్టేషన్‌లో సెబ్ శాఖ సిబ్బంది ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు. సెబ్ సిబ్బందిపై దాడికి పాల్పడిన మనోహర్‌ని అదుపులోకి తీసుకున్నామని, దాడిలో పాల్గొన్న మరో ఐదుగురిని కూడా గుర్తించామన్నారు.

రథోత్సవంలో అపశ్రుతి

పావగడ: స్థానిక శనీశ్వర స్వామి బ్రహ్మ రథోత్సవంలో అపశ్రుతి చోటు చేసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. గత శనివారం నిర్వహించిన రథోత్సవంలో రథం చక్రాల కింద స్థానిక జేడీఎస్ నాయకుడు రామకృష్ణారెడ్డి, మాజీ మున్సిపల్ అధ్యక్షురాలు ధనలక్ష్మి కుమారుడు సుజన్ పడ్డారు. వారి కాళ్ల మీద రథం చక్రాలు వెళ్లడంతో తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనను అప్పట్లో ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు. అదే రోజు బాధితులిద్దరూ వేర్వేరు ఆస్పత్రుల్లో చేరి చికిత్స పొందారు. మధుమేహంతో బాధపడుతున్న 65 సంవత్సరాల వయసున్న రామకృష్ణారెడ్డి ఎడం పాదం చీలి పోవడంతో స్థానిక ప్రభుత్వాస్పత్రిలో 32 కుట్లు వేసి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం బెంగుళూరులోని ఓ ఆస్పత్రిలో ఆయన చేరారు. సుజన్ సైతం హిందూపురంలోని ఆర్థోపెడిక్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిసింది. ఆలయ సమితి, పోలీసుల నిర్లక్ష్య వైఖరే ప్రమాదానికి కారణంగా బాధిత కుటుంబసభ్యులు ఆదివారం ఆరోపించారు.

భక్తులతో కిటకిటలాడిన కోటంక

- ఘనంగా శ్రీవారి కల్యాణం
- వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి తిరునాల
- కిక్కిరిసిన ఆలయ ప్రాంగణం
- దుకాణాల వద్ద భక్తుల సందడి

గార్లదిన్నె: మండలంలోని కోటంక కొండల్లో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి తిరునాల మూడో ఆదివారం వైభవంగా జరిగింది. భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. శనివారం రాత్రి స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. ఆదివారం తెల్లవారుజామున విశేష పూజలు, అర్చనలు పెద్ద ఎత్తున జరిగాయి. అనంతరం కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులను రథంపై అధిష్టింపజేసి వేలాది భక్తుల గోవిందనామస్మరణతో ముందుకు లాగారు. సాయంత్రం పల్లకీ ఉత్సవం నేత్రపర్వంగా సాగింది. తిరునాల సందర్భంగా ఆలయ పరిసరాల్లో ఏర్పాటు చేసిన వివిధ దుకాణాల వద్ద భక్తుల సందడి నెలకొంది. ఆలయ ధ్వజ స్తంభం దాత మోదుపల్లి సుబ్బయ్య ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.


వెండి కవచ అలంకరణలో దర్శనమిస్తున్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి


ఉత్సవ మూర్తులకు కల్యాణోత్సవం నిర్వహించిన దృశ్యం


దర్శనానికి బారులు తీరిన భక్తులు